క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



బిక్కవోలు: స్థానిక శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. మాసశివరాత్రిని పురస్కరించుకొని 158 అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ సిబ్బంది అన్న సమారాధన చేశారు.

ఆలయానికి షామియానా అందజేత

బిక్కవోలు: మండలంలోని శ్రీ కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రతి మంగళవారం జరిగే అన్నదాన సమయంలో వినియోగించేందుకు భక్తులు షామియానాను అందజేసినట్టు ఈవో రామలింగభాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కుసుమంచి శ్రీరామమూర్తి, గుణం రమేష్ షామియానా, కుర్చీలు, బల్లలు అందించారని, వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు.
ప్రతి నెలా మాస శివరాత్రి రోజున గోలింగేశ్వర స్వామికి నిర్వహించే లక్షపత్రి పూజ మంగళవారం గ్రామస్తుల సహకారంతో జరిపించినట్లు ఆయన తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ఊలపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామపంచాయతీలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శి పోతుల ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. మంగళవారం రాజానగరం జీఎస్‌ఎల్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య పరీక్షలు చేశారు. 98 మందికి పరీక్షలు చేయగా వారిలో 20 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

రంగంపేట: విద్యతోనే బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని పాత కోటపాడులో గల మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావు, హెచ్‌ఎం వసంతరావు పాల్గొన్నారు.

1156 రకం ధాన్యం కొనుగోలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గోకవరం: ప్రభుత్వం 1156 రకం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గోకవరం మండల రైతులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడంతో పాటు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 1156 రకం ధాన్యం కొనుగోలు చేయకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి తమ వద్ద ఉన్న ఈ రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చింతల రామకృష్ణ, జుట్టా వీరబాబు, రాయవరపు అప్పారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సారాతో మహిళ అరెస్ట్

సీతానగరం: మండలంలోని మిర్తిపాడుకు చెందిన కొరడా వెంకటలక్ష్మి సారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వెంకటలక్ష్మి సోమవారం రాత్రి సారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నామని, ఆమె నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు.

పోలింగ్ స్టేషన్ల తనిఖీ

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డీవో చైత్రవర్షిణి మంగళవారం మండలంలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. బొమ్మూరు, ధవళేశ్వరం గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ల పరిస్థితి, నీటివసతి, ఫర్నీచర్, లైటింగ్ ఇతర సదుపాయాలపై ఆరాతీశారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, వీఆర్‌వోలు ఉన్నారు.

తాటిముంజెలతో ఉపశమనం

- రోడ్ల పక్కన విక్రయం
- పలువురికి జీవనోపాధి

రాజానగరం: తాటిచెట్టు నుంచి లభించే తాటి కాయలకు వేసవిలో మంచి డిమాండ్ ఉంటుంది. ఆ కాయలను కట్ చేస్తే తాటి మంజెలు లభిస్తాయి. వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి మానవాళికి ప్రకృతి ప్రసాదించిన వరం ఈ తాటి ముంజెలు. వేసవి సీజన్‌లో మాత్రమే దొరికే వీటిని విక్రయిస్తూ ఎంతోమంది జీవనోపాధిని పొందుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రైతుబిడ్డలకు మాత్రమే దొరికే ఈ తాటిముంజెలు ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో నిమిత్తం లేకుండా బాటచారులకు దారిపొడవునా లభిస్తున్నాయి. వేసవి సెలవులకు వచ్చిన స్నేహితులతులు, బంధువులతో కలిసి సరదాగా పొలాలకు వెళ్లిన భూస్వాముల పిల్లలు తమ పాలికాపుల ద్వారా తాటిచెట్ల నుంచి ముంజెలు కోయించి ఆరగించేవారు. ఈ ఆధునిక కాలంలో ఆ విధంగా పొలాలకు వెళ్లి, తీరుబడిగా ముంజెలు ఆరగించేందుకు తీరిక ఎవరికీ ఉండటం లేదు. భూస్వాముల పిల్లలైనా, వారి స్నేహితులైనా పొలాల్లో అడుగు పెట్టే రోజులు పోయాయి.
అక్షరాభ్యాసంతోనే పోటీతత్వాన్ని అలవర్చుకుంటున్న ఈ రోజుల్లో సామాన్యుల పిల్లలు సైతం పుస్తకాలకు అతుక్కుపోతుంటే ఇక భూస్వాముల పిల్లల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. పట్టణాల్లో హాస్టళ్లల్లో చేర్చి మరీ చదివిస్తుంటే ఇక పొలాల గురించి, తాటి ముంజెల రుచి గురించి తెలుసుకుని ఆస్వాదించే తీరిక వారికి ఎక్కడుంటుంది. అందుకే రోడ్ల పక్కన లభిస్తున్న ఈ తాటిముంజెలపై అందరూ ఆసక్తిని కనబరుస్తున్నారు.



తాటికాయల నుంచి ముంజెలు తీస్తున్న దశ్యం

సీజన్‌లో ఇదే వృత్తి

రాజమహేంద్రవరం నుంచి రాజానగరం వరకూ, వెంకన్నపేట నుంచి కాకినాడ వరకు, కొవ్వూరు నుంచి ఏలూరు జంక్షన్ వరకూ రోడ్ల పక్కన ఈ తాటిముంజెలను విక్రయిస్తుంటారు. రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన అనేక మంది ఈ సీజన్‌లో ఇదే వృత్తిగా చేసుకుని జీవనం గడుపుతుంటారు. డజను ముంజెలను కవర్‌లో వేసి రూ.50 లకు విక్రయిస్తున్నారు. ఇక పల్లెల్లో అయితే సైకిళ్లపై ఇంటింటికీ తిరిగి మరీ విక్రయిస్తున్నారు.

అనేక పోషకాలు

వేసవి తీవ్రత కారణంగా మన శరీరంలోంచి పోయే అనేక పోషకాలను కొబ్బరి బొండాలతో పాటు తాటిముంజెలు తిరిగి అందిస్తాయని వైద్యులు చెబుతున్నారు. వంద గ్రాముల తాటి ముంజెలో 92.5 గ్రాముల తేమ, 6.4 గ్రాముల కార్బోహైడ్రేటులు, 0.6 గ్రాముల ప్రొటీన్లు, 0.2 గ్రాముల పీచు పదార్థాలు, 0.1 గ్రాము కొవ్వు, 61 మి.గ్రా. ఆమ్లం, 12 మి.గ్రా. కాల్షియం, 21 మి.గ్రా. పాస్పరస్, 0.3 మి.గ్రా. ఇనుప ధాతువు ఉంటాయి. వీటిని తీసుకోవడం వలన వేసవి తాపం తీరడంతో పాటు శరీరానికి అవసరమైన కేలరీలు లభిస్తాయి. అంతేకాక వీటిని ముఖానికి ఫేస్‌ప్యాక్‌గా కూడా ఉపయోగిస్తుంటారు. ఈ విధంగా చేస్తే ముఖంలో అలసట పోతుందని, మొటిమలు, నల్లమచ్చలు కూడా తగ్గుతాయని చెబుతారు. జిల్లాలోని మెట్ట ప్రాంతమైన రాజానగరం, రంగంపేట, కొవ్వూరు, గుండుగొలను, కాకినాడ జిల్లాలోని గండేపల్లి మండలాల నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ, రావులపాలెం, జొన్నాడ, సామర్లకోట ప్రాంతాలకు వీటిని తీసుకుపోయి, రోడ్ల పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తుంటారు.



తాటి ముంజెలు

చాకిరీ ఎక్కువ

తాటిచెట్లు ఎక్కి తాటి కాయలను కోయడం ఒక ఎత్తు, వాటిని తీసుకువెళ్లి రోడ్ల పక్కన పెట్టి అమ్మడం మరోఎత్తు. తాటి కాయలను పదునైన కత్తితో నైస్‌గా చెక్కి మంజులు జాగ్రత్తగా బయటకు తీయాలి. ఆ విధంగా తీసిన వాటిని 12 (డజను) చొప్పున కవర్లలో వేసి విక్రయిస్తున్నాం. ఈ క్రమంలో చాకిరీ ఎక్కువగానే ఉంటుంది. రాబడి మాత్రం అంతంత మాత్రమే. రోజుకు రూ. 500 పైబడి ఆదాయం వస్తుంది.
– ఊతాడ ఏసు, కోలమూరు

జగనన్న గోరుముద్దపై ఆరా



ఊలపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు శివ

బిక్కవోలు: మధ్యాహ్నం భోజనం నూరు శాతం తినేలా చూడాలని ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 44 మంది విద్యార్థులు ఉంటే ఎందుకు 38 మంది మాత్రమే భోజనం చేస్తున్నారని హెచ్‌ఎం బాలును అడిగారు. కొందరు విద్యార్థులు అనారోగ్య కారణంగా తినడంలేదని తెలిపారు. వారు కూడా భోజనం చేసేలా చూడాలని ఆయన సూచించారు.

నూరుశాతం హామీల అమలు ఘనత మాదే



ఫరిజల్లిపేటలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఫరిజల్లిపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేసి చూపిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ఫరిజల్లిపేటలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా ఆ గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, ఆయా కుటుంబాలను ఆప్యాయంగా పలకరించారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో కేవలం రూ.47 లక్షలతో అభివృద్ధి జరిగితే, తమ ప్రభుత్వంలో గత నాలుగేళ్లలో రూ.4.13 కోట్ల మేరకు అభివృద్ధి జరిగిందని వివరించారు. అలాగే వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఏటా 2,326 మందికి రూ.3,42,15,744 వరకూ ఆర్థిక ప్రయోజనం కలుగుతోందన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు

గ్రామంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరలోనే ఇంటి స్థలాలను అందజేస్తామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యపై కొందరు మహిళలు అడగడంతో ఈ జాప్యానికి గల కారణాలను వారికి తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నానిబాబు, సర్పంచ్ ఉండమట్ల సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ ఉండమట్ల రాజబాబు పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

రాష్ట్రంలో వ్యవసాయం మరింత అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఫరిజల్లిపేటకు చెందిన వైఎస్సార్ సీహెచ్‌సీ గ్రూప్ సభ్యులకు వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో మంజూరైన రూ. 6.74 లక్షల ట్రాక్టర్‌ను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆ ట్రాక్టరును కొంతసేపు నడిపారు.

సంక్షేమంలో దేశానికి ఏపీ ఆదర్శం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో ఈబీసీ నేస్తం పథకంపై లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శక పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన ఓసీ వర్గాలకు చెందిన పేద మహిళలకు ఏడాదికి రూ.15,000 చొప్పున మూడేళ్లలో రూ.45,000 సాయంగా అందించనున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా రెండో విడతగా మండలంలోని 11 గ్రామాల పరిధిలో మొత్తం 2,774 మంది లబ్ధిదారులకు రూ. 4,16,10,000 ప్రభుత్వం మంజూరు చేసి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. అక్కచెల్లమ్మలు ఆర్థికాభివృద్ధి సాధిస్తే వారి కుటుంబాలు, తద్వారా రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి మొదలు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపునేస్తం వంటి అనేక పథకాలు అమలు చేస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇన్ని పథకాలు అమలు చేసారా? అని ప్రశ్నించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, సర్పంచ్ వారాకుమారి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖ చిట్టి ఆనందరాజు, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, ఏడుకొండలు, తుమ్మా రాజేశ్వరి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్‌ఎస్, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీడీఓ బీఎల్ నరసింహం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

బళ్లమ్మ తీర్థం రేపు



బళ్లమ్మ వారు

పెదపూడి: స్థానిక బళ్లమ్మ వారి తీర్థం గురువారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన బళ్లమ్మ వారి తీర్థానికి మండల నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరవుతారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. కొత్త దంపతులు, కొత్తగా వాహనాలు కొనుగోలు చేసుకున్నవారు అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ నెల 19 రాత్రి అమ్మవారి జాతర నిర్వహిస్తారు. బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు, బ్యాండ్‌మేళాలు, ప్రత్యేక ఆకర్షణగా శక్తి వేషాలు, డప్పు వాయిద్యాలు ఏర్పాటు చేశారు.

వేసవిలో నీటిఎద్దడి రాకుండా చర్యలు

రాజానగరం: నియోజకవర్గంలో నీటిఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అధికారులకు సూచించారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన మంగళవారం సమీక్షించారు. గ్రామ శివారున ఉన్నవారికి కూడా నీటి సమస్య రాకుండా పైపులైన్ల మరమ్మతులు ఉంటే తక్షణమే చేపట్టాలన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 220 కోట్లతో చేపట్టిన పనుల ప్రగతిపై ఆరా తీశారు. ఎవరికి, ఎటువంటి సమస్యలున్నా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డీపీఓ జగదాంబ, డీఎల్పీఓ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

బిక్కవోలు: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొమరిపాలెం గ్రామానికి చెందిన యాండ్రపు పైడియ్య ఈ నెల 15వ తేదీన తన భార్య అయిన అపర్ణతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం అపర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

చలివేంద్రాలు ప్రారంభం



పెదపూడిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ శ్రీనివాసు

పెదపూడి: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై పి.వాసు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు ప్రారంభించారు. ఏఎస్సై శ్రీనివాసు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సభ్యుడు కాకార సాయి బాబు పాల్గొన్నారు.

నాగరత్నం కాలనీలో..

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ వద్ద సీతానగరం – పురుషోత్తపట్నం రోడ్డును ఆనుకుని వైఎస్సార్ సీపీ నాయకుడు, వార్డు మెంబరు మట్ట శ్రీనివాస్ మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వాహనచోదకులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి రోజూ చల్లని తాగునీరు అందిస్తామని, ఎండ తీవ్రంగా ఉన్న రోజుల్లో మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు.



నాగరత్నం కాలనీలో మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

రంగాపురంలో..

బిక్కవోలు: మండల పరిధిలోని రంగాపురంలో గల సింగంపల్లి రోడ్డులో చలి వేంద్రాన్ని గ్రామ సర్పంచ్ గండికోట వీరభద్రరావు మంగళవారం ప్రారంభించారు. సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా

పెదపూడి: గ్రామాల్లో ప్రజలకు ఎప్పటికప్పుడు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని కాకినాడ డీఎల్‌పీఓ అమ్మాజీ సచివాలయం కార్యదర్శులను ఆదేశించారు. పెదపూడి గ్రామంలోని సమగ్ర రక్షిత తాగునీరు సరఫరా పథకం, మండలంలోని మరో 25 రక్షిత తాగునీరు పథకాల ట్యాంక్‌ల శుభ్రత కార్యక్రమాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రక్షిత తాగునీరు పథకాలు శుభ్రం చేశారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలం ఎండలు పెరుగుతున్నాయని, దీంతో గ్రామాల్లో తాగునీరు ఇబ్బందులు లేకుండా ప్రజలకు తాగునీరు అందించడానికి రకాల చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనల ప్రకారం వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయాలన్నారు. ఎంపీడీఓ పి.విజయభాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి, సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, బి.ప్రసన్నకుమార్, ఎస్‌వీ.స్వామి పాల్గొన్నారు.



పెదపూడిలో రక్షిత తాగునీటి సరఫరా పథకం శుభ్రత పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ అమ్మాజీ

నర్సరీలో విత్తనాల చోరీకి యత్నం!

- యజమాని అడ్డుకోవడంతో ఇద్దరు యువకుల పరారీ
- మోటారు సైకిల్ స్వాధీనం
- పోలీసులను ఆశ్రయించిన నర్సరీ రైతు

కడియం: మురమండ సమీపంలోని ఒక నర్సరీలో మిర్చిమేరీ గోల్డ్ రకం విత్తనాలను చోరీ చేసేందుకు ఇద్దరు యువకులు చేసిన ప్రయత్నం.. నర్సరీ రైతు అప్రమత్తమై వారిమీద తిరగబడడంతో విఫలమైంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మురమండ సమీపంలోని నర్సరీలో ఉన్న మిర్చిమేరీగోల్డ్ రకం మొక్కలకు ఉన్న విత్తనాలు గతంలో ఒకసారి మాయమయ్యాయి. దీంతో నర్సరీ రైతు రాత్రిపూట అక్కడ కాపలాగా పడుకుంటున్నారు. సోమవారం రాత్రి 12 గంటల సమయంలో ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి, బండిని నర్సరీ బయట నిలిపి లోపలికి రావడాన్ని నర్సరీ యజమాని గుర్తించాడు. దీంతో అప్రమత్తమై, వారిద్దరూ లోపలికి వచ్చి విత్తనాలు కోసుకునే ప్రయత్నంలో ఉండగా కేకలు వేస్తూ వారిని పట్టుకునే ప్రయత్నం చేశాడు. ఆ యువకులు ఈ క్రమంలో అతడిని విడిపించుకుని మోటారు సైకిల్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. సదరు రైతు ఆ మోటారు సైకిల్‌ను నర్సరీ అసోసియేషన్ ద్వారా కడియం పోలీసులకు అప్పగించారు. దీనిపై వారు దర్యాప్తు ప్రారంభించారు. కాగా సదరు మోటారు సైకిల్ ఎఫ్‌ఆర్ రిజిస్ట్రేషన్‌పై ఉన్నట్లు గుర్తించారు. భీమవరంలోని ఒక షోరూమ్ నుంచి ఆ బండిని కొనుగోలు చేసినట్లుగా తెలుస్తోంది. చోరీకి ప్రయత్నించిన ఇద్దరూ వ్యక్తులను విత్తనాలు అమ్ముతామంటూ తరచూ నర్సరీల వెంట తిరిగే ర్యాలి ప్రాంతానికి చెందిన వారిగా భావిస్తున్నారు. అయితే సదరు బండి వారిదేనా, లేకపోతే అది కూడా చోరీ చేసి తీసుకువచ్చిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమకు దొరికిన ఆధారాలను అనుసరించి పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మిర్చిమేరీగోల్డ్ రకం మొక్కలకు ఏర్పడిన డిమాండ్ నేపథ్యంలో చిన్నసైజు మొక్క రూ.150 పైగా పలుకుతోంది. కడియం ప్రాంతంలోని నర్సరీల్లో అతి తక్కువగా మాత్రమే ఈ రకం మొక్కలు ఉత్పత్తి అవుతున్నాయి. దీంతో వీటిని కూడా దొంగతనం చేసేందుకు కొందరు వ్యక్తులు తెగబడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ రకం మొక్కలు సాగుచేసే రైతులు రాత్రిపూట తమ నర్సరీల్లో స్వయంగా కాపలా ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో కూడా కడియపులంక పంచాయతీ పరిధిలో సుమారు రెండున్నర లక్షల రూపాయల విలువైన ఈ రకం మొక్కలను పీకిమరీ పట్టుకుపోయిన ఘటనలు కూడా ఉన్నాయి.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



మర్రిపూడిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

రంగంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని మర్రిపూడి గ్రామంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను సేకరించారు. గోడలపై జగనన్న స్టిక్కర్లు అతికించారు. అనంతరం బ్రోచర్లను అందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, గ్రామ ఉప సర్పంచ్ మేడిది చక్రం, పార్టీ కన్వీనర్ వేము చిరంజీవి పాల్గొన్నారు.



కోరుకొండలో పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రభుత్వ పాలనపై ప్రజల సంతృప్తి

మధురపూడి: సీఎం జగన్ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమానికి వస్తున్న ఆదరణే దానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మండలంలోని కోరుకొండ, బూరుగుపూడి, దోసకాయలపల్లి, నర్సాపురం, నిడిగట్ల గ్రామాల్లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. కోరుకొండలో సాంబశివరావు కాలనీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనక ప్రాంతం టీచర్స్ కాలనీల్లో నాయకులు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పర్యటించారు. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అయిల రామకృష్ణ, బొండాడ చందు తదితరులు పాల్గొన్నారు.